కూటమి తీరు దురదృష్టకరం

- బడుగుల గురించి సున్నితంగా ఆలోచించాలి
- పాలకులు, అధికారులకు ఆ స్పృహ లేకపోవడం బాధాకరం
- ఒంగోలు మార్కెట్‌లోని బాధిత చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ:

నగరంలోని కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ఇటీవల దుకాణాల కూల్చివేతకు గురైన బాధితులకు తాము మద్దతుగా ఉంటామని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారులు సాయంత్రం వరకు కూరగాయలు అమ్ముకుంటే వారికి కేవలం వేతనానికి సరిపడా మాత్రమే వస్తుందన్నారు. అలాంటి వారి పందిళ్లను దౌర్జన్యంగా తొలగించి వారి ఉపాధిని నాశనం చేస్తే రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఆ నష్టం నెల రోజుల శ్రమని అన్నారు. బడుగుల బతుకుల గురించి సున్నితంగా ఆలోచించాలని, కూటమి పాలకులకు, అధికారులకు ఆ స్పృహ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. చిరు వ్యాపారులంతా మార్కెట్లో ఎక్కడో ఒక చోట కూర్చుని అమ్ముకునే వెసులుబాటు కల్పించాలన్నారు. 2020–21 సంవత్సరాలలో కరోనా టైంలో మార్కెట్ ఓపెన్ చేయనీయలేదని, మున్సిపల్ ఆఫీస్ వారు తాళాలు వేయగా, వ్యాపారాలు లేక వారంతా ఇబ్బందులు పడ్డారన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారికి లక్షలు పెనాల్టీలు వేసి డబ్బు కట్టమంటూ ఎక్కడ తెచ్చి కడతారని ప్రశ్నించారు. వడ్డీలు మీద వడ్డీలు కట్టమంటూ వారిని ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. కోవిడ్ టైంలో వేసిన అద్దె, వాటిపై వేసిన వడ్డీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెన్యువల్‌కు వెళితే.. రెన్యువల్ కాలేదని చెప్పి పేరబెట్టి పెనాల్టీలు వేయడం సమంజసం కాదన్నారు. కరోనా తర్వాత మిగిలిన కాలంలో మామూలుగా రావాల్సిన అద్దె మాత్రమే వసూలు చేసుకోవాలన్నారు. మీకు చలానాలు కడుతూ వ్యాపారాలు చేసుకుంటున్నారని, మీకు అడ్డంగా ఉంటే వారికి ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. అంతేగానీ, దౌర్జన్యపూరితమైన వాతావరణం మంచిది కాదన్నారు. కూరగాయలు అమ్ముకునే ఆడవారిపై కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. చిరువ్యాపారులకు ఏ సహాయం కావాలన్నా అండగా నిలబడతామని చుండూరు రవిబాబు స్పష్టం చేశారు.

కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ కొత్త కూరగాయల మార్కెట్‌లో భయానక వాతావరణంలో చిరువ్యాపారుల దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. చుండూరు రవిబాబు ఆదేశాల మేరకు కార్పొరేటర్లు సందర్శించగా, అక్కడ చిరువ్యాపారులపై కూటమి ప్రభుత్వం చూపిన ద్వేషం చాలా బాధాకరమన్నారు. చిరు వ్యాపారులపై అధికారులు చేసిన విధ్వంసం ఎన్నో పేద కుటుంబాలలో విషాదం నింపిందన్నారు. వారంతా రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి లోపు సంపాదించుకుని జీవించేవారేనన్నారు. అలాంటి వారి దుకాణాలను ప్రత్యామ్నాయం చూపకుండా సరుకును కూడా చెల్లాచెదురు చేసి తొలగించడం కక్షసాధింపు చర్యని అన్నారు. బడుగులకు నష్టం కలిగించిన మున్సిపల్ అధికారుల తీరును వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.


కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులు

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్‌లో ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం ఒంగోలులోని కార్యాలయంలో అందజేశారు. ఎ.ధనలక్ష్మికి చీరాల ఎంపీడీవో కార్యాలయంలో, జవంగుల మల్లికార్జునరావుకు కురిచేడు ఎంపీడీఓ కార్యాలయంలో, గంటా సుబ్బరావమ్మకు ఒంగోలు జెడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామకాల కింద ఆఫీస్ సబార్డినేట్లుగా ఉపాధి కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సీఈఓ బి.చిరంజీవి నియామక ఉత్తర్వులు అందజేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

- ఐక్యంగా ముందుకుసాగి ప్రజావ్యతిరేక కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి
- పార్టీ ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపు

కొత్తపట్నం వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, 2029లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ ఏర్పాటయ్యేలా ముందుకు సాగాలని ఆ పార్టీ ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం కొత్తపట్నం మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షత వహించగా, చుండూరు రవిబాబు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టి వారిని ఎదుర్కోవడానికి ఐక్యంగా ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలు అమలు చేస్తామని చెప్పి ఏడు నెలలైనా ఇవ్వకుండా ఆంధ్రరాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని గుర్తు చేశారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ యువత ఉత్సాహంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొని వైఎస్సార్ సీపీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా మనమంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈతముక్కల ఎంపీటీసీ సభ్యుడు, అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన పథకాలు పేద ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడ్డాయన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. పథకాలు అమలు కావాలంటే 2029లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసపు మాటలను తిప్పికొట్టాలంటే కార్యకర్తలంతా ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనకు ఎటువంటి విబేధాలున్నా సర్దుకుపోయి కలిసికట్టుగా పనిచేద్దామని చెప్పారు. మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలిచ్చి ఎంతో మంది పేదలను జగనన్న ఆదుకున్నారన్నారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ పార్టీలో పదవులు తీసుకుంటే సరిపోదని, అందరూ అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలి భర్త సైకం రాంబాబు, సర్పంచ్‌లు నంబూరి సూర్యనారాయణ, విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, గాలి ముసలారెడ్డి, గోవింద్, రాజుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బ్రహ్మారెడ్డి, పురిణి శ్రీనివాసరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ఆదినారాయణ, మూగా బాలాజీ, పాలేటి ఆంజనేయులు, తంబి వెంకటేశ్వర్లు, దోనె రామ్మోహన్, తాతా నాంచార్లు, సుదర్శ కోటేశ్వరరావు, కొల్లూరి సంజీవరావు, కట్టా శ్రీనివాసరావు, కరిముల్లా, కొక్కిగడ్డ శ్రీనివాసరావు, దోనె రామ్మోహన్, యలగల ఆదినారాయణ, బండారు వెంకటసుబ్బారావు, బ్రహ్మారెడ్డి, తాతా శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి, బాజీ, సామంతుల వీరారెడ్డి, రోశయ్య, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రథసప్తమికి టీటీడీ నుంచి పొన్నూరుకు ఆహ్వానం

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నిర్వహించే రథసప్తమి వేడుకలకు వ్యాఖ్యాతగా తనకు ఆహ్వానం అందినట్లు ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. వచ్చే మంగళవారం తిరుపతిలోని గోవిందరాజస్వామికి జరిగే ఏడు వాహన సేవలలో మూడు వాహనసేవలకు వ్యాఖ్యాతగా తనకు అవకాశం లభించిందన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరుసగా జరిగే పెద్దశేషవాహనం, ముత్యాలపందిరి వాహనం, సర్వభూపాల వాహన సేవలకు వ్యాఖ్యాతగా తాను వ్యవహరించనున్నట్లు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన టీటీడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నూరును పలువురు అభినందించారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో ఈ నెల 3వ తేదీ నుంచి మూడు నెలల పాటు మహిళలకు ఉచితంగా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జే రవితేజ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల్లోపు గల నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9963005209 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సదరమ్ క్యాంపు ఏర్పాట్ల పరిశీలన


సదరమ్ క్యాంపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఒంగోలు అర్బన్: రెండో విడత జరగనున్న సదరమ్ క్యాంపు నిర్వహణ ఏర్పాట్లను శనివారం డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, రిమ్స్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ బాలాజీ, ఆర్ఎంఓ చెంచయ్య, అధికారుల బృందం పరిశీలించింది. వికలాంగులను గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వేచి ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు, తాగునీరు, కుర్చీలు, వీల్‌చైర్స్ వంటివి అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల అనంతరం వివరాలు నమోదు చేసేందుకు అవసరమైన సాంకేతికతను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి, ప్రోత్సాహక నగదు అందజేత


విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ వెంకారెడ్డి, ఆరేటి కుటుంబ సభ్యులు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు పంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మాజీ మంత్రి ఆరేటి కోటయ్య సతీమణి, రిటైర్డ్ టీచర్ ఆరేటి కోటమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబీకులు విద్యార్థులకు పలకలు, ప్యాడ్లు పంపిణీ చేశారు. 6, 7, 8 తరగతుల్లో ముందంజలో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందించారు. పాఠశాల అభ్యున్నతికి రూ.5 వేలను కోటమ్మ కుమారుడు ఆరేటి సుందర్‌రాజా, కుమార్తెలు సుగుణ జ్యోతి, విజయ జ్యోతి అందించారు. దాతలను సంతనూతలపాడు ఎంఈఓ డి.వెంకారెడ్డి, పాఠశాల హెచ్ఎం జి.శేషిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వి.ప్రియాంక, ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, శివనారాయణరెడ్డి, భాగ్యం, మేరీ సృజన, విజయనిర్మల, ప్రసూనదేవి, రాధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంగోలు వచ్చిన దత్త పీఠాధిపతి


ఆధ్యాత్మిక ప్రవచనాలలో గణపతి సచ్చిదానంద స్వామీజీ

ఒంగోలు మెట్రో: దత్త క్షేత్ర నాదయాత్రలో భాగంగా అవధూత దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి శనివారం ఒంగోలు వచ్చారు. స్థానిక మంగమూరుడొంకలోని ఆశ్రమం వద్ద జగద్గురు ఆదిశంకరాచార్యుల వేద పాఠశాల దగ్గర పునర్నిర్మాణంలో ఉన్న రామాలయాన్ని సందర్శించారు. రామాలయాన్ని వీలైనంత త్వరగా పునఃప్రతిష్ఠించాలని దేవస్థాన నిర్వాహకులకు కోరారు. పాల్గొన్న భక్తులకు ప్రవచనాలు అందించారు. దత్త విజయానంద తీర్థస్వామీజీ నిర్వహణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

అధికారులు ప్రోటోకాల్ పాటించాలి

- మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజన్ కుమార్, పక్కన ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ప్రోటోకాల్ పాటించాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో కనీస వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయంగా ప్రతి అధికారి పనిచేయాలని కోరారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి అభివృద్ధి సాధించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారి శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, తదితర అంశాల గురించి వివరించారు. సమావేశంలో గతంలో తీసుకొచ్చిన సమస్యలపై మల్లవరం గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్ల సంఘ అధ్యక్షుడు నారా వెంకట సుబ్బారెడ్డి ప్రశ్నించారు. తమ పంచాయతీలోని చిన్న మల్లవరం నుంచి బోయపాటివారికుంట వరకు డొంకలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జంగిల్ తొలగింపు బిల్లులు అడుగుతున్నా ఇవ్వట్లేదన్నారు. దీనిపై ఏపీఓ ధనుంజయవర్మ నిలదీయగా, త్వరలోనే పనిచేసి పెడతామని చెప్పారు. సంవత్సరం నుంచి ప్రతి సర్వసభ్య సమావేశంలో పట్టించుకోవడం లేదని సర్పంచ్ అన్నారు.

మిషనరీ ద్వారా పనిచేయించడంపై వివాదం...

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కేవలం జాబ్ కార్డు పొందిన వ్యక్తుల ద్వారా మాత్రమే పనిచేయించాలని ఏపీవో అనడంతో.. తమ గ్రామంలోని గుండ్లకమ్మ నదిలో జంగిల్ తొలగించే క్రమంలో 54 కోట్ల రూపాయల నిధులకు జాబ్ కార్డు పొందిన వారి ద్వారా పనిచేయించకపోగా, మిషనరీ ద్వారా కాంట్రాక్టర్ ఎందుకు పనిచేయించారంటూ ఆ గ్రామ సర్పంచ్ నిలదీశారు. పైగా, పంచాయతీ వాళ్లకు తెలియకుండానే నిధులు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మండలంలోని పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిమెంట్ రోడ్ల నిర్మాణంలో లెవెలింగ్ పనులను జాబ్ కార్డు పొందిన వ్యక్తుల ద్వారా చేయించకుండా అన్ని చోట్లా మిషనరీ ద్వారానే పని చేస్తున్నారని ఏపీఓను ఆయా పంచాయతీల సర్పంచులు నిలదీశారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈని అడగాలని ఏపీఓ అనడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామపంచాయతీలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఏపీవోకు లేదా అంటూ ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. పశుసంవర్ధకశాఖ డాక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ ఇటీవల మల్లవరం గ్రామంలో ఇన్సూరెన్స్ డబ్బులు, మిషన్ కొనమని ఇచ్చిన నగదును తన సొంత అవసరాలకు మల్లవరం సర్పంచ్ వాడుకుంటున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అయితే, పలువురు సర్పంచులు మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ ఏడీ సుగన్యరావు సర్వసభ్య సమావేశానికి హాజరు కారని, మండల కేంద్రంలో ఏడీ కార్యాలయాన్ని లక్షలు పెట్టి గత ప్రభుత్వం కట్టించినా పశువులకు వైద్య సేవలు సక్రమంగా అందట్లేదని మండిపడ్డారు. గత నెలలో మంత్రి డోలాకు ఫిర్యాదు చేసినా మార్పు లేదన్నారు. దీంతో ఏడీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో వీఎస్ ప్రసాదును ఎంపీపీ ఆదేశించారు. సర్పంచ్ల సంఘ జిల్లా అధ్యక్షుడు, దొడ్డవరప్పాడు సర్పంచి బెజవాడ రాము, ఘడియాపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు మాట్లాడుతూ ఆరోగ్యశాఖ, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ శాఖ, గ్రామ పంచాయతీల తీర్మానాలపై విమర్శలు చేశారు. ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అధికారులను హెచ్చరించారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్ తేనీటి విందుకు ఏడుగుండ్లపాడు గ్రామ సర్పంచ్ శిల్ప సౌందర్య హాజరుకావడంపై సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో ఎంపీపీ, సర్పంచులు ఆమెను సన్మానించారు. సమావేశంలో తహసీల్దార్ సుజన్ కుమార్, ఎంపీటీసీలు వాకా కోటిరెడ్డి, పల్లకి పద్మకుమారి, ప్రభాకర్, బొమ్మల దేవదాసు, సర్పంచులు నారా వెంకటసుబ్బారెడ్డి, దాసరి శిల్పసౌందర్య, రావిపాటి శేషయ్య, బొమ్మల రామాంజనేయులు, పలు శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదల

- పాల్గొన్న మంత్రులు, కలెక్టర్


గుండ్లకమ్మ రిజర్వాయర్లో చేపపిల్లలు వదులుతున్న మంత్రులు డోలా, గొట్టిపాటి, కలెక్టర్

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ జలాశయంలో శనివారం సాయంత్రం చేప పిల్లలు విడుదల చేశారు. మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా మత్స్యశాఖ అధికారులు 20,65,000 చేప పిల్లలను విడుదల చేయించారు. ముందుగా అర్చకులు వేదమంత్రాలు చదివి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా నిలవడం కోసం రిజర్వాయర్‌లో చేప పిల్లలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు వీరయ్య, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మద్దిపాడు తహసీల్దార్ సుజన్ కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వరప్రసాద్, మల్లవరం సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, జిల్లా ఇన్చార్జి డీఎఫ్ఓ సర్గాని శ్రీనివాసులు, బాపట్ల ఇన్‌చార్జి డీఎఫ్ఓ బెల్లంకొండ కృష్ణకిషోర్, ఎఫ్‌డీఓ సుభానీ, రమేష్, రవీంద్ర, ఇన్‌స్పెక్టర్లు రాము, గౌరీశంకర్, వీఎఫ్ఏలు, సాగర మిత్రలు, స్థానిక లైసెన్స్ మత్స్యకారులు పాల్గొన్నారు

పాఠశాల నిర్వహణపై డీఈఓ ఆగ్రహం


హెచ్ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

సంతనూతలపాడు: మండలంలోని కొనగానివారిపాలెం హైస్కూల్లో విద్యార్థులకు బోధన సక్రమంగా లేదని, మధ్యాహ్న భోజనం, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉన్నాయని డీఈఓ కిరణ్ కుమార్ హెచ్ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్‌ను శనివారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. మొదట పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వందరోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమ నిర్వహణ తీరును, విద్యార్థుల అభ్యసన స్థాయిలను డీఈఓ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని, 45 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో పాల్గొనగా, ఏడుగురు విద్యార్థులకు భోజనం సరిపోకపోవడం, భోజనం రుచికరంగా లేకపోవడం, పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయడం లేదంటూ మండిపడ్డారు. హెచ్ఎం గుణ ప్రసాద్, ఉపాధ్యాయులను సంజాయిషీ కోరారు. డీఈఓ వెంట ఎంఈఓ డి.వెంకారెడ్డి ఉండగా, పాఠశాలపై నివేదిక అందజేయాలని అతన్ని డీఈఓ ఆదేశించారు.

మిషన్ లెర్నింగ్ ప్రాధాన్యత అంశంపై అవగాహన

ఒంగోలు సిటీ: ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మిషన్ లెర్నింగ్, దాని ప్రాధాన్యత అనే అంశంపై ప్రత్యేక అతిథిగా కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ డాక్టరు జె.హనుమంతరావు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మిషన్ లెర్నింగ్ ప్రాముఖ్యత, దాని ప్రయోజనాలు, పరిశ్రమలో దాని ప్రయోగం, భవిష్యత్తులో విద్యార్థులకు అందించే అవకాశాలు వంటి అంశాలను విశదీకరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి ప్రాక్టికల్ అప్లికేషన్ల గురించి చర్చించారు. మొదటి, రెండు సంవత్సరాల బీఎస్సీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై మిషన్ లెర్నింగ్ గురించి అవగాహన పొందారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సరళ, బోధన సిబ్బంది సుష్మ, హేమ, పావని, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్-2025 ప్రత్యక్ష ప్రసారం, విశ్లేషణ

ఒంగోలు సిటీ: ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డోలా అనంతలక్ష్మి ఆదేశాల మేరకు వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2025 ప్రత్యక్ష ప్రసారం, విశ్లేషణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా బడ్జెట్‌ను వీక్షించారు. వాణిజ్య విభాగ ఇన్‌చార్జ్ పి.కుసుమకుమారి ముఖ్యాంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో బడ్జెట్‌పై చర్చించి బడ్జెట్ ప్రభావంపై అవగాహన కల్పించారు. వాణిజ్య విభాగ అధ్యాపకులు కె.రాణి, ఎం.పద్మ హాజరయ్యారు. సురేష్‌కుమార్ సాంకేతిక సహాయాన్ని అందించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవయవ దానం ఎంతో గొప్పది


వెంకటరావు మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

ఒంగోలు అర్బన్: అవయవదానం ఎంతో గొప్పదని, దానిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఏడుకొండలు అన్నారు. అద్దంకి వాస్తవ్యుడు అభ్యుదయవాది గుంజి వెంకటరావు మరణించడంతో వారి కుటుంబ సభ్యులు పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. ఇటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. వెంకటరావు కుమారుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తన తండ్రి జీవించినంతకాలం ప్రజలు, కార్మికులకు సేవ చేశారని, ఆయన చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యుల సమ్మతితో శరీర దానం చేశామని తెలిపారు.

ఉపాధ్యాయుడి ప్రవర్తనపై విచారణ

మద్దిపాడు: మండల పరిధిలోని ఓ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి ప్రవర్తనపై జిల్లా స్థాయి అధికారులు శనివారం విచారణ చేపట్టినట్లు సమాచారం. ఆడపిల్లల చేతులు తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కొందరు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. పాఠశాలలో చదువుతున్న 4, 5 ,6, 7, 8 తరగతుల విద్యార్థినులను విచారించిన అధికారులు.. ఎవరికీ చెప్పరాదంటూ ఒత్తిడి చేసినట్లు సమాచారం.

హైస్కూల్‌కు కుర్చీల వితరణ

సంతనూతలపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు పారిశ్రామికవేత్త, చీమకుర్తి మండల ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు శిద్దా సుధాకర్ శనివారం కుర్చీలు బహూకరించారు. సుధాకర్‌ను ఎంఈఓ డి.వెంకారెడ్డి, హైస్కూల్ ఇన్చార్జ్ హెచ్ఎం ఎస్.ఫణిపద్మకుమారి అభినందించారు. కార్యక్రమంలో సుధాకర్ సతీమణి జయభారతి, ఇతర కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, చీమకుర్తి మండల ఆర్యవైశ్య నాయకులు మద్ది వెంకట్రావు, నూకల సుబ్రహ్మణ్యం, ఆలపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు రామాంజనేయులు, చంద్రమౌళి, హైస్కూల్ స్టాఫ్ సెక్రటరీ వజ్రాల మాధవీలత, పీడీలు మల్లికారాణి, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కుర్చీలు అందిస్తున్న శిద్దా సుధాకర్